

# మధ్య నిలబడిన మనిషి

*

ఆచంట శారదాదేవి

పొలం గట్టునించి పొద్దుపొయ్యాక ఇంటితోవ పట్టాడు సీతారాం!

అప్పటికే ఒకరిద్దరు రైతుల ఇళ్ళకు పోతూ అడిగారు, "బాబుగారు ఏదో ఆలో చిత్తన్నారు. ఒంటిగా ఉన్నారు." అని. ఒంటరిగా ఉండటం ఏదో చెయ్యగూడని అపరాధం! మనిషి కాస్తంత ఏకాంతము, విశ్రాంతి కోరుకోడం అందరికీ వింత!

రోజూ ఆఫీసుపని పూర్తికాగానే అలా మాధవయ్య హోటలుకు వెళ్ళి కాస్త కాఫీ త్రాగి, అలా ఊరి బయట పొలాలవైపు వెళ్ళడం అతనికి అలవాటు. చీకటి పడుతూ ఉంటె ఎవరో ఒకరు పలకరి స్తారు.

"ఏం బాబుగారు, ఒంటరిగా ఉన్నారు" అని, అది ఇంక ఇంటికి వెళ్ళడానికి సిగ్నల్. అంతకన్నా ఆలశ్యమైనా విశాల ఊరుకోదు. అంతవరకు ఎలానో ఓర్చు కుంటుంది. ఎప్పుడో ఒకసారి ఆవిడకు చెప్పాడు "ఆఫీసరు మంచివాడుకాదు. ఆఫీసు కాగితాలన్నీ పూర్తిగా టైపు చేసి ఇస్తేనేకాని వదలడు." అని. విశాల నమ్మింది. అంచేత కాస్సేపు ఆఫీసరును తిడుతుంది. ఆ తరువాత ఓపికలేక సీతా రాంను సాధిస్తుంది. "ఇంటికి రావాలన్న ధ్యాసలేదు, భార్య ఎందుకు ఒకరరిమీద మమకారం. మరొకరితో సంసారం. దొంగ బ్రతుకులో ఏం సుఖం!" అలా అలా సాగుతుంది. చివరకు ఏడుస్తుంది ఈ గొడవ భరించలేడు.

నిజానికి ఆఫీసరు చాలా మంచివాడు. అయిదు కాకముందే హాయిగా వెళ్ళి పోతాడు. అయినా తనకు ఇంటికి వెళ్ళా లనుండదు. ఇంట్లో సంతోషంగా ఎదురు చూడటానికి ఏముంది. ఎప్పుడూ విశాల ఏదో సాధింపుతో ప్రారంభించి ఏడు పుతో ముగిస్తుంది. అంచేత ఆ కొంపకు వెళ్ళడానికి ఏం ఉత్సాహం ఉండదు. వీలై నంతవరకు దూరంగానే ఉంటాడు. పదే ళ్ళుగా ఈ బ్రతుకు ఇలానే సాగుతోంది. విశాలతో వాదించి లాభంలేదు. నెమ్మదిగా చెప్పినా, మందలించినా ఆమెకు అర్థం కాదు. ఇంకా ఇంకా కోపం రెచ్చి పిచ్చి దానిలా ఉంటుంది. చివరకు హిస్టీరియా వచ్చి విరుచుకు పడుతుంది. ఇరుగు పొరుగు వింటారన్న భయం ఆమెకులేదు. అది తనకు విపరీతంగా ఉంది. తను ఉంటున్నది ఒక చిన్న వాటా! అందులో మెల్లగా మాట్లాడినా అందరికి వినపడు తుంది. ఇరుగు పొరుగు సానుభూతితో చూసినా తనకేదో అవమానంగా ఉంటుంది. అంచేత విశాలకు ఏమీ చెప్పడు. సాధించి సాధించి విసుగెత్తి ఆమే ఊరుకుంటుంది.

చిన్నప్పుడు సొంత ఊళ్ళో గోవింద బాబుగారి తోటలో తనూ, తల్లీ ఒక చిన్న పాకలో ఉండేవాళ్ళు. గోవిందబాబుగారిది చాలా పెద్ద బంగళా, చుట్టూ పెద్ద తోట. పెద్ద మామిడితోపు. అందులో పెద్ద బావి, దాని దగ్గర ఒక గుడి! గోవిందబాబుగారి నౌకర్లు తోటలోనే పాకలు వేసుకున్నారు. అంత పెద్ద బంగళాలో గోవిందబాబు ఒక్కడే! ఆయనకు ఒకత్తే కూతురు. ఆమె ఎప్పుడూ పట్నంలోనే ఉంటుంది. ఎప్పుడైనా పిల్లలతో వస్తుంది. తన తల్లి ఆయనకు వండిపెట్టేది. ఆయన ఇచ్చిన

డబ్బుతో తనను చదివించేది. తనకు చిన్నప్పుడు అంత చురుకుగా చదవబ్బ లేదు.

ఒకసారి వేసవి సెలవుల్లో ఆయన మనుమరాలు పార్వతి వచ్చింది. పార్వతి తనకన్నా మూడేళ్ళు పెద్దది. ఆ పిల్లను తను చూసి చాలా ఏండ్లయింది. ఈ మధ్య ఆ పిల్ల ఎప్పుడూ పల్లెకు రాలేదు. చిన్నప్పుడు ఎప్పుడో పారతితో ఆడుకున్నాడు, కాని పెద్దయ్యాక ఆ పిల్లతో మాట్లాడడానికి భయం వేసింది. పట్నంలో నాగరికంగా మసలే ఆ పిల్ల పల్లెల్లోనే పాదుకుపోయిన తన్ను మొరటు అనుకుంటుందేమో!

ఒక రోజు ఆ పిల్లే తనను పలకరించింది. సాయంత్రంవేళ తోటలో తన దగ్గరకు వచ్చింది. "అలా ఆ మామిడి తోపులోకి వెళదాం వస్తావా?" అంది. తాను సంకోచంగా ఊరుకున్నాడు. అంతలో అమ్మ అన్నది. "వెళ్ళరా! అమ్మాయికి పాపం పొద్దుపోవటంలేదు." తనకు వెళ్ళక తప్పలేదు.

ఆ రోజునించి ఆమెతో మామిడి తోపులోకి షికారు వెళ్ళడం అలవాటైంది. ఆ పిల్లమీద విపరీతమైన అనురాగం ఏర్పడింది. ఆ పిల్ల తనతో చిలిపిగా ఆడుకుంది. ప్రేమతో కౌగిలించింది. ఒకరోజు గుడికి వెళ్ళారు. అక్కడ ఒక్క క్షణం నిలబడ్డారు, అంతలో పార్వతి తన్ను కౌగిలించుకుంది. మనస్సు పరవశమైంది. అక్కడ ఎవరూ లేరు. ఆ క్షణం దేవుని ఎదట తమకు వివాహమైనట్టనిపించింది. ఆ బంధం ఎవరూ విడదీయలేరనుకున్నాడు, వికసించిన మనస్సుతో ఇంటికి వెళ్ళాడు. మర్నాడు పార్వతి ఊరికి వెళ్ళింది.

పార్వతి ప్రేమ అనుబంధం అందరికి చెపుతుందనుకున్నాడు. త్వరలోనే తను ఆమెను కలుసుకుంటాననుకున్నాడు ఆతరువాత తెలిసింది. పార్వతికి పెళ్లి నిశ్చయమైందని, పెళ్ళి కొడుకు పెద్ద ఉద్యోగస్థుడని! తన్ను ఎవరో కొరడాతో కొట్టి నిద్ర మేల్కొలిపినట్లయింది. దిగ్భ్రాంతితో దిక్కుతోచలేదు. మనసు భరించలేని బాధతో కుమిలిపోయింది. అప్పుడు తెలిసింది. ఆమె తనకన్న పెద్దది. ఆమె అంతస్థువేరు, తన అంతస్థు వేరు. తనకు చదువులేదు. ఉద్యోగంలేదు. వెర్రిగా పార్వతి చూపిన చనువు చేత అందని పండుకు ఆశపడ్డాడు. మనసులో ఏదో ఆరని పుండులా ఉంది.

పార్వతికి పెళ్ళి అయింది. గోవింద బాబు, తనతల్లి ఇంకా కొంతమంది నౌకర్లు అందరూ పెళ్ళికి వెళ్ళారు, అంతతోటలో అంత ఇంటిలో తాను ఒంటరిగా మిగిలాడు. ఇల్లు బావురుమంటోంది. మనసు బావురుమంటోంది. ఆ నాలుగురోజులు తాను అనుభవించిన శూన్యం జీవితంలో మరపురానిది. క్రమంగా పెళ్ళికి వెళ్ళిన వాళ్ళు తిరిగివచ్చారు. మళ్లా ఇల్లు సందడిగా ఉంది. జీవితం మామూలుగా సాగుతోంది.


ఫోను నెం — 636
రెసిడెన్సు — 5631
తంతి — కాపర్
పోస్టుబాక్సు-31

తల్లం సత్యనారాయణ అండ్ సన్సు

శివాలయంవీధి, విజయవాడ-1

యిత్తడి, రాగి, స్టెయిన్‌లెస్-స్టీలు హోల్‌సేలు అండ్ రిటైల్
డీలర్సు అండ్ మాన్యుఫాక్చరర్స్ -.

ప్రొప్రయిటర్సు:

శ్రీ కాళీ అల్యూమినియం వర్క్సు, మఠంవీధి, విజయవాడ.

స్టాకిస్టు - రుక్మిణీ కుక్కర్లు, ప్రెస్టేజి ప్రెషర్ కుక్కర్లు, ఆషాపాట్ పాన్
(పూరీలు, అప్పడములు తయారుచేయుసాధనము)

పైన ఉదహరింపబడిన వివిధ రకముల గృహోపకరణములు సరసమైన ధరలకు.
గ్యారంటీ పద్ధతితో సకాలములో సప్లయి చేయుగలము.

ఒక్కసారి ఆర్డరు యిచ్చిచూడండి.

మనసు శూన్యంగాఉంది.

కొన్నాళ్ళకు తనకు పార్వతి ని చూడా లనిపించింది. అది అణచుకోలేని తపన అయింది. పార్వతి తనకేదో అన్యాయం చేసినట్లనిపించింది. అదే ఆమెను అడగా లనిపించింది. తను పట్నం వెళ్ళాడు. పార్వతి ఇంటికి వెళ్లాడు. అది చాలా పెద్ద ఇల్లు. కింద పెద్దహాలు, ఖాళీగావుంది. వాకిట్లో నౌకరు ఉన్నాడు. హాల్లో ఒంట రిగా కూర్చున్నాడు, పార్వతికోసం ఎదురు చూస్తూ. కాస్సేపటికి పార్వతి వచ్చింది. మేడదిగి తన్నుచూసి విస్తుపోయింది. "ఎందుకు వచ్చావ్?" అంది చిరాకుతో. తనకు ఏం చెప్పాలో తోచలేదు. నోరు మెదిపితే కంటివెంట నీరువస్తుందేమో నని పించింది. ఆమె ఎక్కడికో వెళ్ళాలని తొందరపడుతోంది. అంతలో ఆమెభర్త కూడా వచ్చాడు. అతను ఆరడుగులమనిషి. అతనిముందు తాను మరీ వామనమూర్తిగా కుంచించుకుపోతున్నట్లనిపించింది. పార్వతి తన్ను పరిచయం చేసింది. "మా తాతగారి వంటావిడ కొడుకు' అంది నిర్లిప్తంగా. అతను 'ఓహో' అన్నాడు, తేలిగ్గా. మళ్లా వెంటనే "మేము ఇప్పుడు ఒకపార్టీకి వెళ్ళాలి. ఇంకోసారిరా ఏదైనా పని ఉంటే!" అన్నాడు. సమాధానంకోసం ఎదురుచూడలేదు. ఇద్దరూ వెళ్ళిపోయారు. తను హాల్లో ఒంటరిగా మిగిలాడు. వెళ్ళిపోతూంటే నౌకరుకూడా తననేదో చులకనగా చూసినట్లనిపించింది. దుఃఖము, అవమానము మనసును కమ్ముకున్నాయి. మళ్ళా జన్మలో పార్వతిని చూడాలనిపించలేదు. ఆమె అంతస్థువేరు, తన అంతస్థువేరు. ఆమె కాలక్షేపానికి కాస్సేపు తనతో ఆడుకుంది. నిర్లిప్తంగా నిముషంలో వదిలేసింది. మరువలేని మమతలు పెంచుకుని కుమిలిపోయేతను వెర్రివాడు.

కొన్నాళ్ళకు తను తైపు నేర్చుకున్నాడు. ఉద్యోగం సంపాదించుకున్నాడు. తల్లిచని పోయింది. విశాలతో పెళ్ళైంది. విశాల అందకత్తెకాదు. పొట్టిగా, లావుగా నల్లగా ఉంది. అయినా ఆమె తనమనిషి. అన్ని విధాలా తనను ఆదుకుంటుంది. మనసులో లోపల దాచుకున్న ఆవేదనలు, ఎవరి తోనూ చెప్పుకోలేనిమాటలు ఆమెతో చెప్పుకోవచ్చు అది తనకు ఊరట. పెళ్ళైన కొత్తలో ఒకరోజు ఆమెతో చెప్పాడు పార్వతికీ తనకు తాత్కాలికంగా ఏర్పడిన అనుబంధంగురించి, పార్వతి ఎలా తనకు భ్రమలు కలిగించింది, ఎలా తన కలలు భగ్నమైంది! ఆమె తనను ఓదారుస్తుందనుకున్నాడు. విశాలప్రేమలో పార్వతిని మరచిపోవచ్చనుకున్నాడు. కాని అలా జరగలేదు. అప్పుడు తనకు పసితనం. అనుభవంలేదు. కొత్తగా పెళ్ళైనపిల్ల వినకూడని మాటలు అవికాదని తనకు తెలియదు. ఆమాటలు చెప్పవలసిన అవసరంలేదనీ తెలియదు.

చెప్పినదివిని విశాల వెక్కి వెక్కి ఏడ్చింది. తాను ఆమెకు ఏదో ద్రోహం చేసినదానిలా బాధపడింది. ఇంకాస్సేపటికి విరుచుకుపడింది. ఆ నాటినుంచి ఆమె మామూలు మనిషికాదు. ఏదోరోగ పీడితురాలిలా మారింది. ఆమె మనసులో పార్వతి నీడ విషంలా నిలచింది. ఆ తరువాతఆమెలో అసూయ, ద్వేషము, ఎత్తిపొడుపు మాటలు, ఏడుపులు, మూర్ఛలు ఇవే మిగిలాయి. అనుమానం, అవమానం,అసూయ ఆమెను క్షణ క్షణం దహించి, తన్ను దహించింది. ఏనాడో తనకు దూరమై, ఎంతగానో తాను మరచిపోవాలని తపన పడుతున్న పార్వతి, విశాల అసూయలో రంగులు దిద్దుకుని, విశాలకు తనకూ మధ్య నిలచింది. రోజులు గడుస్తున్నా విశాలలో మార్పులేదు. మారుతుందన్న ఆశలేదు.

అందుకే తాను ఇంటికి దూరమై అలమటిస్తున్నాడు. స్వచ్ఛమైన పాలలో విషబిందువు కలసింది. నిర్మలంగా ఉండవలసిన బ్రతుకులోనీడ పడింది. విశాల చేజేతులా బ్రతుకుపాడుచేసింది. పార్వతిని తాను చూసి ఎన్నో ఏళ్ళయింది. చూడాలన్న కోరిక కూడా లేదు! అయినా మసక బారిన విశాల మనసు గ్రహించదు.

● ● ●

చీకటి పడుతోంది. ఇంక ఇంటికి వెళ్ళక తప్పదు. అడుగులు బరువుగా ముందుకు పడుతున్నాయి. ఆఫీసర్! మేనేజరుతో అంటున్న మాటలు మెదడులో వినిపిస్తున్నాయి.

"ఆ కాగితాలు సీతారాం కివ్వండి. అతనైతే జాగ్రత్తగా తైపు చేస్తాడు."— బండబారిన బ్రతుకులో అదొక్కటేఅమృత కిరణం.

□●●

---

● "యుద్ధాలు ఎలా మొదలవుతాయి నాన్నగారూ?" అని అడిగింది అమ్మాయి.
తండ్రి ఆమెకు అర్థమయ్యేట్టు చెబుదామనే తాపత్రయంతో 'చూడమ్మా మనకూ సింహళం వాళ్ళకూ యుద్ధం వచ్చిందనుకో" అని మొదలెట్టాడు.
తల్లికుట్టుపని చేసుకుంటూ" మనకూసింహళానికీ మధ్య యుద్ధంలేదు"అన్నది.
తండ్రి : పేపరు పక్కనవుంచుతూ "లేదులేకానీ నేను ఉదాహరణ చెబుతున్నాను." అన్నాడు.
తల్లి : ఊలుదండ పక్కన పడేస్తూ 'అయినాసరే... పసిపిల్లకు అలా అబద్ధాలు చెప్పకూడదు...' అన్నది.
తండ్రి : కోపంగా నేనేం అబద్ధాలు చెప్పడంలేదు' అన్నాడు.
తల్లి : వూలువుండ దూరంగా విసిరిపారేస్తూ "అబద్ధాలే చెబుతున్నారు" అన్నది.
తండ్రి : "కాదని చెప్పడంలేదూ..,నువ్వు మాట్లాడే పద్దతి బొత్తిగా...."అని అరిచాడు.
"ఏం? నేనుమాట్లాడే పద్దతిలో తప్పేముంది? ఎవర్నన్నా పిలవండి అడుగుదాం. ఎవరిది తప్పో...." అని తల్లి తారాజువ్వలా లేచింది.
అమ్మాయి వారిద్దరి మధ్యకూ వెళ్ళి" ఆగండి.... నాకిప్పుడు యుద్ధాలు ఎలా మొదలవుతాయో అర్థమయింది...."అన్నది.